క్లుప్తంగా

పది పరీక్షలు ప్రశాంతం

క్రోసూరు: పదవ తరగతి పరీక్షలు మండలంలో ప్రశాంతంగా జరుగుతున్నాయి. సోమవారం లెక్కల పరీక్ష జరిగింది. మొత్తం 908 మందికి గానూ 904 మంది హాజరైనట్లు ఎంఈవో గణేష్ తెలిపారు. పరీక్ష కేంద్రాలను స్పెషల్ స్క్వాడ్ తనిఖీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు 14 మంది విద్యార్థినుల ఎంపిక



బెల్లంకొండ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 14 మంది విద్యార్థినులు మలబార్ గోల్డ్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బత్తుల ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మలబార్ గోల్డ్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏటా ప్రభుత్వ కళాశాలలో చదివే పేద, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది బైపీసీలో ఏడుగురు, ఎంపీసీలో నలుగురు, సీఈసీలో ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి సోమవారం విజయవాడలోనే తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నగదు బహుమతులు అందించినట్లు ఆమె తెలియజేశారు.

చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలు అవసరం



బెల్లంకొండ: చిన్నతనం నుంచే ఉన్నత లక్ష్యాలు ఎంచుకొని విద్యను అభ్యసించాలని సైకాలజిస్ట్, కౌన్సిలర్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్ వద్ద గల కస్తూర్బా పాఠశాలలో బాలికలకు మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు నిత్యం ఆరోగ్య పరిరక్షణతో పాటు మానసిక ఒత్తిడి లేకుండా విద్యను అభ్యసించాలని తెలిపారు. ఉపాధ్యాయులను కుటుంబ సభ్యుల్లా భావించి ప్రతి విషయాన్ని వారితో చర్చించాలని చెప్పారు. తోటి విద్యార్థులతో నిరంతరం స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. అనంతరం భవిష్యత్‌పై బాలికల ఆసక్తిని అడిగి తెలుసుకుని, వారికి సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉషారాణి, సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్‌కు అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్

అచ్చంపేట: స్థానిక సీఐ వెంకట ప్రసాద్‌ను వీఆర్‌కు (వేకెంట్ రిజర్వు) పంపుతూ పల్నాడు జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు తనకు బాధ్యతలు అప్పగించి సీఐ వెంకటప్రసాద్ విధుల నుంచి రిలీవ్ అయినట్లు అచ్చంపేట ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. అయితే, కారణాలు తెలియవలసి ఉందన్నారు. మండలంలోని గ్రంథశిరిలో జరిగిన ఒక కేసులో సీఐ నిర్లక్ష్యంగా వ్యవహరించినందు వల్లనే వీఆర్‌కు పంపినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ కేసులో పోలీసుల అదుపులో నుంచి నిందితుడు తప్పించుకు పోయినందు వల్లనే సీఐని వీఆర్‌కు పంపినట్లు తెలిసింది. ఇదే గ్రామానికి బాధ్యతలు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ రమేష్‌ను కూడా సస్పెండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

అమరావతి: గంజాయి కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో ఈనెల 20వ తేదీ అరు డొంకల బావి సమీపంలోని పాత కోళ్ల ఫారం దగ్గర గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం మేరకు దాడి చేశారు. పోలీసులను చూసి ఐదుగురు పారిపోయారు. సంఘటన ప్రదేశంలో నిందితులు వదిలేసిన 1.5 కేజీ గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. ఇందులో మూడో నిందితుడైన నర్రావుల తారక నరసింహా చౌదరిని స్థానిక గుంటూరు రోడ్డులోని ఆర్చి వద్ద విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సీఐ అచ్చియ్య సిబ్బందితో అరెస్ట్ చేసి, కోర్టులో హాజరు పరిచారు. ఈ కేసులో ఇంకా నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామని అచ్చియ్య తెలిపారు.

వ్యర్థాలకు అడ్డాగా వైద్యశాల రోడ్డు



పెదకూరపాడు: వ్యర్థాలకు అడ్డాగా పెదకూరపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం రోడ్డు మారింది. వైద్యశాల పక్కనే ఉన్న మురుగు కాలవ ఒడ్డున పశువుల వ్యర్థాల నిల్వతో పాటు ఖాళీ కొబ్బరి బొండాలను పడేస్తున్నారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు దోమలతో రోగులు అవస్థలు పడుతున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి.... వ్యాధుల నుంచి రక్షణ పొందండి అంటూ ప్రచారం చేసే వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆస్పత్రి పరిసరాలను పట్టించుకోకపోవడం శోచనీయమని గ్రామస్తులు విమర్శిస్తున్నారు.

చెరువులో దొంగలు పడ్డారు !

- ఎండ్రాయి గ్రామంలో అక్రమంగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- పంచాయతీ తీర్మానం లేకుండానే దందా



ఎండ్రాయి చెరువులో మట్టి తవ్వకాలు

అమరావతి: అనుమతులు లేకుండా మండల పరిధిలోని ఎండ్రాయి చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీలో తీర్మానం చేయకుండా, కార్యదర్శికి, సర్పంచికి తెలియకుండా అధికార పార్టీ నేతల అండదండలతో వందల ట్రాక్టర్ల మట్టిని అక్రమార్కులు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పైగా ట్రాక్టర్లకు గానూ ఎండ్రాయి గ్రామ చెరువు అభివృద్ధి సంఘం అనే ముద్ర వేసిన చీటీలను ఇస్తున్నారు. గ్రామ పంచాయతీ, అధికారుల నుంచి చెరువు అభివృద్ధి సంఘానికి అనుమతులు లేకపోయినా అక్రమ మట్టి తవ్వకాలు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పొంతన లేని అధికారుల సమాధానాలు

మట్టి తవ్వకాలపై కొత్తగా హౌసింగ్ శాఖ మంజూరు చేసిన ఇళ్ల మెరక కోసం మట్టి తోలుతున్నారని గ్రామ రెవెన్యూ సిబ్బంది చెబుతుంటే ఇందుకు భిన్నంగా హౌసింగ్ శాఖ సిబ్బంది చెబుతున్నారు. హౌసింగ్ ఏఈ శ్రీనివాసరావు మాత్రం గ్రామంలో ఇరవై మందికి పైగా ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారని చెబుతున్నారు. వాటి పొజిషన్ సర్టిఫికెట్‌తోపాటు ఇతర పత్రాల ఎంక్వైరీ కోసం మాత్రమే దరఖాస్తుదారుల జాబితాను వీఆర్వోకు పంపామని, ఈ ఏడాదిలో ఇంత వరకు ఇళ్లు మంజూరు కాలేదని చెబుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలపై తహసీల్దార్ డానియేల్ మాట్లాడుతూ విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



మట్టి రవాణా ట్రాక్టర్‌కు ఇచ్చే చీటీ

స్వచ్ఛ గ్రామ పంచాయతీల సాధనే లక్ష్యం



నందిగామలో అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ



క్రోసూరులో శిక్షణ పొందుతున్న పారిశుధ్య కార్మికులు, గ్రీన్ అంబాసిడర్స్

- సత్తెనపల్లి ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి
- నందిగామ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో నియోజకవర్గ స్థాయిలో శిక్షణ

సత్తెనపల్లి: వ్యర్థ రహిత గ్రామ పంచాయతీల లక్ష్యాన్ని ప్రతి పంచాయతీ చేరుకోవాలని సత్తెనపల్లి ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం నందిగామలోని మోడల్ ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్‌లో సత్తెనపల్లి నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో గల గ్రామ పంచాయతీల కార్యదర్శులు, క్లాప్ మిత్రాలు, షెడ్ మిత్రాలకు శానిటేషన్, వేస్ట్ మేనేజ్మెంట్ అంశాలపై ఆరు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభ మైంది. తొలిరోజు శిక్షణలో భాగంగా సత్తెనపల్లి మండలంలోని 13 గ్రామ పంచాయతీలకు చెందిన వారికి శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణను ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి ప్రారంభించి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారు చేయాలని తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి గ్రామం సంపూర్ణ స్వచ్ఛత సాధించాలని, అప్పుడే వ్యాధులు దరి చేరవని చెప్పారు. ఇంటింటి నుంచి తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా సేకరించి, విభజన చేయాలని సూచించారు. పనికొచ్చే వాటిని పక్కన పెట్టి మిగిలిన తడి చెత్తతో వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేయాలని చెప్పారు. రెండో రోజు సెక్షన్‌లో భాగంగా ఈ నెల 25న సత్తెనపల్లి మండలంలోని మిగిలిన 12 గ్రామ పంచాయతీల కార్యదర్శులకు, క్లాప్ మిత్రలకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. 26, 27న నకరికల్లు మండలంలోని గ్రామ పంచాయతీలు, 28న ముప్పాళ్ల మండలంలోని గ్రామ పంచాయతీలు, 29న రాజుపాలెం మండలంలోని గ్రామ పంచాయతీలు వారికి నందిగామలో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. అనంతరం తణుకులో సీఎం చంద్రబాబు నుంచి సన్మానం అందుకున్న ఐటీసీ రిసోర్స్ పర్సన్ చెంబేటి బొలయ్యను సత్కరించారు. కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి ఏ.శ్రీనివాసరెడ్డి, డీపీఆర్సీ డి. నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆళ్ల సాంబయ్య పాల్గొన్నారు.

క్రోసూరులో..

స్థానిక ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో సోమవారం నుంచి పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇస్తున్నట్లు ఎంపీడీవో జి.శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని ఏడు గ్రామ పంచాయతీల కార్యదర్శులు, గ్రీన్ అంబాసిడర్, గ్రీన్ గార్డులకు తొలిరోజు శిక్షణనిచ్చినట్లు తెలిపారు. మంగళవారం మిగతా వారికి ఇవ్వనున్నట్లు చెప్పారు. బుధవారం, గురువారం పెదకూరపాడు మండలం వారికి, శుక్రవారం శనివారం అమరావతి సిబ్బందికి ఇవ్వనున్నట్లు చెప్పారు.

అచ్చంపేటలో..

స్థానిక డంపింగ్ యార్డు వద్ద సిబ్బందికి మూడు రోజుల శిక్షణ తరగతులను సర్పంచ్ షేక్ జాని సోమవారం ప్రారంభించారు. తడి, పొడి చెత్తల ద్వారా పంచాయతీలకు ఆదాయం, వర్మీ కంపోస్టు తయారీకి శిక్షణ తరగతులు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి పంతులూ నాయక్ మాట్లాడుతూ ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, పంచాయతీ విస్తరణాధికారి ప్రసాదరావు ఆధ్వర్యంలో తరగతులు మూడు రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఎమ్మార్సీలు, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, గ్రీన్ కార్డ్స్ విధిగా హాజరుకావాలని ఆయన సూచించారు.

ఇళ్ల నిర్మాణానికి అదనపు ఆర్థిక సాయం

పెదకూరపాడు: మండలంలో ఇళ్ల నిర్మాణానికి గానూ ప్రభుత్వం ప్రకటించిన అదనపు ఆర్థిక సాయాన్ని లబ్ధిదారులంతా ఉపయోగించుకోవాలని హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. బీసీ, ఎస్సీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు, విభిన్న ప్రతిభావంతులకు రూ. లక్ష అదనపు ఆర్థికసాయం అందిస్తున్నట్లు చెప్పారు. నాలుగు విడతలుగా ప్రభుత్వం ప్రకటించిన అదనపు సహాయం లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఎఫ్‌టీఓ రూపంలో పడుతుందని వెల్లడించారు. బీఎల్ లెవెల్ నిర్మించుకున్న ఎస్సీ,బీసీలకు రూ.15వేలు, ఆర్ఎల్ లెవెల్ నిర్మించుకున్న వారికి రూ. 15వేలు, ఆర్‌సీ లెవెల్‌లో రూ.10వేలు, పూర్తి చేసుకున్న వారికి మరో రూ.10వేలు పడుతుందని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. ఇదే విధంగా ఎస్టీలకు రూ. 75వేలు, విభిన్న ప్రతిభావంతులకు లక్ష రూపాయలు నాలుగు విడతల్లో పడుతుందని చెప్పారు.

రేషన్ కార్డుదారులకు ఈకేవైసీ తప్పనిసరి

క్రోసూరు: మండలంలోని రేషన్‌కార్డుదారులంతా ఈ నెలాఖరు కల్లా ఈకేవైసీ చేయించాలని తహసీల్దార్ వి.వి. నాగరాజు సోమవారం తెలిపారు. మండలంలోని డీలర్లకు, ఎండీయూ వాహనదారులకు కార్డుదారుల జాబితా అందజేసినట్లు చెప్పారు. మొత్తం 6,457 కార్డులకు గానూ ఇప్పటి వరకు 1,107 మాత్రమే ఈకేవైసీ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. మిగతావి ఈ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని ఆదేశించారు. ఐదు సంవత్సరాల చిన్నారులు మినహా కార్డులోని ప్రతి ఒక్కరూ చేయించాలని, లేనిపక్షంలో రేషన్ పంపిణీలో ఇబ్బందులు పడతారని తెలిపారు.

అమరావతిలో..

మార్చి నెలాఖరు కల్లా రేషన్ కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని సోమవారం తహసీల్దార్ డానియేల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకేవైసీ చేసుకోని లబ్ధిదారుల రేషన్ కార్డుకు భవిష్యత్తులో ఇబ్బందులు వస్తాయని ఆయన సూచించారు. మండలంలోని 16 గ్రామ సచివాలయాల పరిధిలో 22,176 కార్డులు ఉన్నాయని తెలిపారు. ఇందులో 60,853 మంది కుటుంబ సభ్యులు ఉన్నారని, వారిలో ఇప్పటికే 54, 201 మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారని చెప్పారు. మిగిలిన 6,408 మంది తక్షణమే అందుబాటులో ఉన్న చౌక ధరల దుకాణం డీలరు వద్ద ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు.

ట్రాన్స్‌ఫార్మర్లు ఎత్తు పెంచారు



అంబేద్కర్ బొమ్మ రహదారిలో ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచుతున్న విద్యుత్ సిబ్బంది.



ఆర్సీఎం పాఠశాల వద్ద..

సాక్షి స్పందన

పెదకూరపాడు: సాక్షిలో ఈ నెల 24న 'ప్రమాదంగా ట్రాన్స్‌ఫార్మర్లు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ స్పందించింది. ఏఈ రామకృష్ణ సిబ్బందితో కలసి సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రమాదకరంగా ఉన్న ఆర్సీఎం పాఠశాల, అంబేడ్కర్ బొమ్మ రహదారితో పాటు ఇదే రహదారిలో ఉన్న ట్రాన్స్‌ఫారాల ఎత్తు పెంచారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి గ్రామస్తులు కృతజ్ఞత తెలిపారు.

విశిష్ట గుర్తింపు సంఖ్యతో రైతులకు పలు ఉపయోగాలు

నకరికల్లు: రైతులంతా విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు సూచించారు. మండలంలోని గుళ్లపల్లిలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ భూమి కలిగిన ప్రతి రైతూ సేవాకేంద్రాల వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేసుకుంటే 11 అంకెలు గల గుర్తింపు సంఖ్య వస్తుందని తెలిపారు. దీనివల్ల రైతులకు పలు ఉపయోగాలు ఉన్నాయని చెప్పారు. ఏఈవో ప్రసన్నకుమార్ సర్పంచ్ జూపల్లి మోషా పాల్గొన్నారు.



గుళ్లపల్లి రైతు సేవాకేంద్రంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి దేవదాసు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు

క్రోసూరు : కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా పరిష్కార వేదికకు ఐదు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ వి.వి. నాగరాజు తెలిపారు. రెండు అర్జీలు పంచాయతీ సమస్యలు, మూడు అర్జీలు రెవెన్యూపై వచ్చినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన ఆంధ్రప్రదేశ్ ఎస్సీ ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గార్లపాటి దాసు రెండు అర్జీలు అందజేసినట్లు తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా 2023లో ఇంటింటికీ కుళాయి నీళ్లు ఇచ్చేందుకు ఆర్ అండ్ బీ శాఖ ఎస్సీ కాలనీలో రోడ్లు తవ్వి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని, నీళ్ల సరఫరా కూడా చేయలేటం లేదని, ఈ విషయమై గతంలో జిల్లా కలెక్టర్‌కు కూడా అర్జీ అందజేసినట్లు తెలిపారని చెప్పారు.



గ్రీవెన్స్‌లో అర్జీ అందజేస్తున్న గార్లపాటి దాసు

క్రోసూరు ఎస్సీ కాంప్లెక్స్ వెనుక భవన నిర్మాణదారుడు పంచాయతీ కాలువపై శ్లాబ్ వేస్తున్నాడని ఫిర్యాదు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు.

అమరవీరుల త్యాగం చిరస్మరణీయం

సత్తెనపల్లి: అమరవీరుల త్యాగం మరువలేనిదని, చిన్న వయసులోనే దేశం కోసం పోరాడి అమరులైన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ చిరస్మరణీయులని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె. పద్మ కొనియాడారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గల స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌లో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మై భారత్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, నెహ్రూ యువ కేంద్ర గుంటూరు సౌజన్యంతో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షహీద్ దివాస్ (అమరవీరుల దినోత్సవం) సోమవారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమరవీరులను స్మరించడం ఎంతో పుణ్యఫలమన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ భరత జాతికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించడానికి భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ వీరోచిత పోరాటాలు చేసి యువ హృదయాలపై చెరగని ముద్ర వేశారని తెలిపారు. వారిని స్మరిస్తూ కార్యక్రమాన్ని హెల్ప్ ఫౌండేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు మాట్లాడుతూ అమర వీరుల త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత ఉన్నతమైన ఆలోచనలతో ముందుకు కదలాలని సూచించారు. ముందుగా భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ బాబు, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ట్రైనర్ మీరాబీ, విద్యార్థిని, విద్యార్థులు, ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పద్మ

మానసిక ఆరోగ్యానికి ధ్యానం దోహదం

సత్తెనపల్లి: ధ్యానం మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందని తట్టవర్తి రాజ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీస్ మూమెంట్ ఆధ్వర్యంలో సోమవారం ధ్యాన ఆత్మజ్ఞాన శిక్షణ శిబిరం నిర్వహించారు. తట్టవర్తి రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఒత్తిడిని తగ్గించడంలో ధ్యానం సహాయపడుతుందని తెలిపారు. దృష్టిని మెరుగు పరుస్తుందని, స్వీయ అవగాహనను పెంచుతుందని చెప్పారు. వ్యాధులను నిరోధించడంలో సహాయ పడుతుందని పేర్కొన్నారు. ధ్యానం చేయడంలో మెలకువలు, దాని వల్ల వచ్చే ప్రయోజనాల గురించి ఆమె వివరించారు. ప్రతి రోజు 15 నిమిషాలు ధ్యానం చేసి జీవితంలో మార్పులు చూడాలని సూచించారు. కార్యక్రమంలో రామకృష్ణ పిరమిడ్ సొసైటీ నిర్వాహకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న తట్టవర్తి రాజ్యలక్ష్మి

క్షయ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావు



సత్తెనపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది



క్రోసూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సత్తెనపల్లి: క్షయరహిత సమాజాన్ని నిర్మిద్దామని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు అన్నారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి టీబీ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టిన భారీ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వ్యాధిని గుర్తించిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా చికిత్స అందించనున్నట్లు చెప్పారు. క్షయతో బాధపడే వారిని గుర్తించి వారికి సరైన వైద్యం అందేలా ఆశా వర్కర్లు సహకరించాలని ఆయన సూచించారు. ఆర్ఎంఓ శోభారాణి మాట్లాడుతూ క్షయ వాధి నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. రోగులకు ఆరు నెలలకు సరిపడే ఖరీదైన మందులు ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని చెప్పారు. వ్యాధిపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. టీబీ యూనిట్ ఎంఓటీసీ డాక్టర్ అనూషారాణి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉంటే వారి వద్ద కళ్లే (గల్ల) శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం పంపాలని సిబ్బందికి సూచించారు. క్షయ వ్యాధి బారిన పడినవారు భయపడాల్సిన అవసరం లేదన్నారు. డాట్స్ పద్ధతి ద్వారా ఆరు నెలల పాటు మందులు వాడితే జబ్బు నయమవుతుందని చెప్పారు. రోగులు మందులు వాడుతున్న సమయంలో పౌష్టికాహారం నిమిత్తం వారి ఖాతాలో నెలకు రూ. వెయ్యి చొప్పున ఆరు నెలలు డీబీటీ ద్వారా జమ చేస్తారని తెలిపారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది, క్షయ నివారణ కార్యాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు క్షయ వ్యాధి నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అంకమ్మ బాయి, నర్సింగ్ సూపరింటెండెంట్ రాధ, టీబీ యూనిట్ సిబ్బంది ఎంపీహెచ్ఎస్ షేక్ ఇబ్రహీం, ఎస్టీఎస్ ఎన్. జోసఫ్ స్టాలిన్, ఎల్‌టీ ఎం.చంద్రశేఖర్, టీబీ ఫీల్డ్ కోఆర్డినేటర్ ఎం. అశోక్ భవ్య, హెచ్ఓసీ ప్రాజెక్టు సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హెచ్‌వీలు పాల్గొన్నారు.

క్రోసూరులో..

స్థాని పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సిబ్బంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి అమరావతి బస్టాండ్ మీదుగా ఎన్టీరామారావు విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు.' వేయించు బీసీజీ టీకా -నిరోధించు టీబీ రాక ' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన సదస్సులో వైద్య అధికారులు డాక్టర్ ధనుష్, డాక్టర్ షాద్, డాక్టర్ సిరిచందన పాల్గొన్నారు. టీబీ లక్షణాలు, సోకే విధానం, నివారణ, మందులు గురించి వివరించారు. ఈ సందర్భంగా 20 మంది క్షయ రోగులకు ఆరోగ్య కార్యకర్త హైమావతి తండ్రి సూరే జయరావు జ్ఞాపకార్థం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి శిఖాశ్యాంసన్, సీహెచ్‌వో. సాంబశివరావు, సూపర్‌వైజర్ బి. సౌజన్య పాల్గొన్నారు

పెదకూరపాడులో..

క్షయపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని, అప్పుడే దీన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చని 75 తాళ్లూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఆదిత్య అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని ప్రజలకు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. క్షయ మహమ్మారిని అంతం చేయడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. తొలి దశలోనే వ్యాధిని గుర్తించి పూర్తిస్థాయిలో మందులను వినియోగిస్తే నిర్మూలించవచ్చని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

ముప్పాళ్లలో..

క్షయ వ్యాధిపై ప్రతి ఆరోగ్య కార్యకర్తా ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పి.రమాదేవి చెప్పారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవంలో భాగంగా సోమవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షయ వ్యాధి ట్యూబర్ క్యూలోసిస్ అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే అంటు వ్యాధి అని చెప్పారు. ఊపిరితిత్తులను ప్రభావితం చేస్తుందని, క్రమేపీ శరీరంలోని ఇతర భాగాలుగా కూడా వ్యాపిస్తుందని చెప్పారు. రోగ నిరోధకశక్తి తక్కువగా ఉన్న వారికి, హెచ్ఐవీ, షుగర్ ఉన్నవారికి, టీబీ ఉన్న వారితో ఎక్కువ సమయం గడిపిన వారికి, పొగ తాగడం ద్వారా వ్యాపిస్తుందని వివరించారు. వ్యాధి సోకిన వారు మందులను క్రమం తప్పకుండా వాడితే త్వరగా నయమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముప్పాళ్లలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, వైద్య సిబ్బంది ఉస్మాన్, రామకృష్ణ, కామాక్షి, జైనుల్లా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

దడ పుట్టిస్తున్న వంతెన



పెదకూరపాడు పంచాయతీ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్న బ్రిడ్జి

పెదకూరపాడు: స్థానిక ప్రధాన రహదారి (పంచాయతీ కార్యాలయం)పై బ్రిడ్జి నిర్మించి నాలుగు దశాబ్దాలు గడిచింది. పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఈ రహదారిలో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ముఖ్యంగా ఆర్టీసీ, పాఠశాల బస్సులు, పాల వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు లాంటి భారీ వాహనాలతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని పరిస్థితి. ఇటీవల రహదారిని విస్తరించి సీసీ రోడ్డు కూడా వేశారు. దీంతో భారీ వాహనాల సంఖ్య పెరిగింది. అధికారులు భారీ వాహనాలను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూడాలని గ్రామస్తులు, ప్రయాణికులు వేడుకుంటున్నారు. వంతెన నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

సత్తెనపల్లి: ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి, సలహాలు, సూచనలు అందించేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జి.ఎస్.వి.వి.కుమార్ తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు జరుగుతుందని పేర్కొన్నారు. ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, మెరుగైన సేవలకు 9959225429 నంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలైన సంఘటన పట్టణంలోని ఐదు లాంతర్ల సెంటర్‌లో సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ముస్లిం పాలేనికి చెందిన వృద్ధుడు షేక్ అజ్మీద్ డివైడర్ దాటుతున్న క్రమంలో పిడుగురాళ్ల నుంచి విజయవాడ వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీ కొట్టింది. దీంతో అజ్మీద్‌కు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు పట్టణంలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది.